ఆంధ్రజ్యోతి

జగిత్యాల జిల్లా వార్తలు

5★★

సోమవారం 15 జనవరి 2024



గోదాదేవి రంగనాయకుల కల్యాణం 8లో..

దశల వారీగా అభివృద్ధి పనులు పూర్తి 8లో..



సంబరాల సంక్రాంతి

- కళకళలాడుతున్న పట్టణాలు, పల్లెలు
- సొంత గ్రామాలకు చేరుకున్న ప్రజలు
- లోగిళ్లలో రంగవల్లులు
- పిండి వంటలతో సందడి
- నేడు సంక్రాంతి, రేపు కనుమ

జగిత్యాల, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): తెలుగు వారి సంప్రదాయ పండుగ సంక్రాంతిని ప్రజలు ఆత్మీయంగా జరుపుకుంటున్నారు. ఉత్సాహం, ఉల్లాసం, భక్తి భావాల మేళవింపుగా ముచ్చటగా మూడు రోజుల పాటు సంక్రాంతి సంబరాలు చేసుకుంటున్నారు. ఆనందోత్సహాల మధ్య బోగి పండుగను జరుపుకోగా ఈనెల 15వ తేదీన సంక్రాంతి, 16వ తేదీన కనుమ వేడుకలను జరుపుకునేందుకు సి ద్ధమవుతున్నారు. ఇప్పటికే పల్లె, పట్నం అనే తేడా లేకుండా సొంతూళ్లకు జనం తరలివచ్చారు. గ్రామాలు, పట్టణాలకు వచ్చిన జనంతో వీది వీది సందడిగా మా రింది.

● రంగవల్లులు, గొబ్బెమ్మలు...

సంక్రాంతి పండుగలో ముగ్గులకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది. సంక్రాంతి పండుగ నెల రోజుల ముందే మహిళామణులు తమ ఇళ్ల ముందు రోజుకో ముగ్గు వేస్తూ ముంగిళ్లను అందంగా అలకరిస్తారు. పిండితో ముగ్గు వేసి అందులో గొబ్బెమ్మను పెట్టి చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతారు. సంక్రాంతి ముగ్గులో దాదాపుగా రథం ముగ్గు ప్రధానంగా కనిపిస్తోంది. అ ది వచ్చే యేడాది సైతం మరిన్ని లాభాలను నింపుతూ రావాలని నమ్మకం మహిళల్లో ఉంటుంది. ఆవు పేడతో చేసిన గొబ్బెమ్మలను ముగ్గు మద్యలో పెడుతారు. గొబ్బెమ్మలపై ప్రకృతిలో దొరికే గరక పోసలను పెట్టి పూల రేకు లు, పసుపు, కుంకుమ చల్లి వాటి చుట్టూ నవ ధాన్యాలు, రేగు పండ్లు పోసి ప్రత్యేకంగా పూజిస్తారు.

● ఎగురనున్న పతంగులు...

సంక్రాంతి సందర్భంగా పతంగులు ఎగురవేయడం అనవాయితీగా చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ గాలి పటాలు ఎగురవేస్తారు. రంగు రంగుల గాలి పటాలలో ఖరీదైన మాంజాలతో పోటా పోటీగా పతంగులతో సందడి చేస్తారు. జిల్లా కేంద్రలోని టవర్ సర్కిల్ ఏరియా, యావర్ రోడ్డు, పాత బస్టాండు తది తర ప్రాంతాలు పతంగుల విక్రయాలకు అడ్డాలుగా మారాయి. విక్రయాలు, కొ నుగోళ్లతో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురిలలోని పలు కూడల్లు రద్దీగా మారాయి. వీటితో పాటు మండల కేంద్రాలు, ఇతర గ్రామాల్లో సైతం పతంగుల సందడి నెలకొంది. గంగిరెద్దులు, కోడిపందాలు, ఎడ్ల పందాలు కొన్ని గ్రామాల్లో జరుపుకుంటున్నారు.

● వలసలు వీడి సొంతూళ్లలోకి...

సంక్రాంతి పర్వదినం సందర్భంగా ప్రజలు వలసలు వీడి సొంతూళ్లకు చేరు కున్నారు. ఆడపడుచులు సైతం మెట్టింటి నుంచి పుట్టింటికి చేరుకోవడంతో ఇళ్లు, వాడ, పల్లె పండుగ శోభను సంతరించుకున్నాయి. ముందస్తుగా రైళ్లలో రిజర్వే షన్లు చేయించుకొని కొంత మంది, బస్సులు, సొంత వాహనాల్లో మరికొంత మం ది గ్రామాలకు చేరుకున్నారు.

● ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు..

జిల్లాలోని పలు ఆలయాల్లో సంక్రాంతి సంబరాల్లో భాగంగా భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ధనుర్మాసం లో వైష్ణవాలయాల్లో గోదా దేవీ కల్యాణోత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. రైతులు ధాన్యలక్ష్మిని పూజించి మొక్కులు చెల్లించుకుంటుంటారు. అయ్యప్ప దీక్షా భక్తులు ప్రతీరోజు ఆలయాల్లో పూజలు చేయడం, మకర జ్యోతి దర్శనం వంటివి చేస్తుంటారు.

● తెలంగాణ సంక్రాంతి స్పెషల్ సకినాలు...

సంక్రాంతి పండుగ అంటే పిల్లలు మొదలుకొని వృద్ధుల వరకు అందరికి ఇష్టమే. అందులోనూ ప్రత్యేక తినుబండారాల్లో తెలంగాణకు ఓ ప్రత్యేకత ఉంది. కరకరలాడే సకినాలు అనగానే మనవాళ్లతో పాటు ఏ ప్రాంతీయులకైనా నోరూరుతాయి. ఒక ఇంటి వారు మరో ఇంటి వారికి పండి వంటలు, సకినాలు ఇచ్చి పుచ్చుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకుంటుంటారు. ఆడపడుచులు, వదినామరదళ్లు, అక్కా చెల్లెల్లు, తల్లీకూతుళ్లు, అత్తా కోడళ్లు కలివిడిగా ఉంటూ సకినాలు చేయడం ఈ పండుగ ప్రత్యేకత.

ఇంటిల్లిపాది ఆనందంగా జరుపుకునే పండుగ

- దావ వసంత సురేశ్, జడ్పీ చైర్‌పర్సన్, జగిత్యాల



ఇంటిల్లిపాది ఆనందంగా జరుపుకునే పండుగ సంక్రాంతి. రంగు రంగుల ముగ్గులు వేయడం, గొబ్బెమ్మలు అలంకరించడం, పతంగులు ఎగురవేయడం, నోములు ఇచ్చి పుచ్చుకోవడం తదితర పనుల్లో మహిళలు రోజంతా బిజీ బిజీగా గడుపుతారు. రైతులు ధాన్య లక్ష్మీకి పూజలు చేయడం వంటివి చేస్తుంటారు.

సంక్రాంతి ఆత్మీయ, అనురాగాలను అందిస్తుంది

- తాటిపర్తి విజయలక్ష్మీ దేవేందర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, జగిత్యాల



సంక్రాంతి పండుగ ఆత్మీయ, అనురాగాలను అందిస్తుంది. ఎక్కడెక్కడో ఉన్న కుటుంబ సభ్యులందరూ ఒక్క చోటకు చేరి భక్తి శ్రద్ధలతో మూడు రోజుల పాటు పండుగను జరుపుకుంటుంటారు. బోగి, సంక్రాంతి, కనుమ పండుగలను వరస గా చేసుకుంటూ ఆనందోత్సహాలతో గడుపుతుంటారు.

తెలుగు సంప్రదాయం ప్రతిబింబిస్తోంది

- అయిత అనిత, కవయిత్రి, జగిత్యాల



సంక్రాంతి ఉత్సవాల్లో తెలుగు సంప్రాదాయం ప్రతిబింబిస్తోంది. ముగ్గులు, గొబ్బెమ్మలు, పతంగులు, గంగిరెద్దులు, కోడి పందాలు, ఎడ్ల పందాలు, హరిదాసు ల ప్రదర్శనలు, పిండి వంటలు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు. ఇలా ఒకటేమిటీ మన సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే విదంగా బోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగలను జరుపుకుంటాము.

నరసింహుడి సన్నిధిలో ప్రభుత్వ విప్ అడ్లూరి పూజలు



అడ్లూరికి స్వామి ప్రసాదం ఇస్తున్న ఆలయ సిబ్బంది

ధర్మపురి, జనవరి 14: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదివారం సందర్శించారు. ఆలయం పక్షాన మంగళ వాయిద్యాలు వెంటరాగా వేదపండి తులు, అర్చకులు ఆయనకు సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం స్వామి సన్నిధిలో ఆయన ప్రత్యేక పూజలు జరిపి దర్శనం చేసుకున్నారు. ఆలయ వేదపండి తులు బొజ్జ రమేష్‌శర్మ వేద మంత్రోచ్చరణల మద్య ఆలయ అర్చకులు సముద్రాల వంశీ ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్ ఆయనకు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రప టం బహూకరించి సత్కరించారు. అంతకు ముందు యమధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూ నె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. అనుబంధ ఆలయాలు, అద్దాల మండపాన్ని కూడ సంద ర్శించారు. ఆయన వెంట వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌శర్మ, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ రాజగోపాల్, పాలెపు ప్రవీణ్‌శర్మ, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, టీపీసీసీ సభ్యులు సంగ నభట్ల దినేష్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు సింహరాజు ప్రసాద్, మండల అధ్యక్షులు రాందేని మొగిలి, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, మహేష్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు సుభిక్షంగా ఉండాలని నరసింహుని వేడుకున్నట్లు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శనం చేసుకున్న అనంతరం ఆయన కొద్దిసేపు విలేకరులతో మాట్లాడారు. నరసింహుని ఆశీస్సులు, ప్రజల సహకారంతో తాను ఎమ్మెల్యేగా గెలిచి, ప్రభుత్వ విప్ పదవి పొందినట్లు ఆయన తెలిపారు. క్షేత్రాభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు పేస్కేల్ అమలు చేయాలి

ఎమ్మెల్సీకి ఉద్యోగుల వినతి

రాయికల్, జనవరి 14: విద్యాశాఖలో 13 ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు మినిమం పే స్కేలు అమలు చేస్తూ, ఉద్యోగాలను రెగ్యులరైజేషన్ చేసే విధంగా సీఎం దృష్టికి తీసుకువెళ్లాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని రాష్ట్ర సమగ్ర శిక్ష అసోసియేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కోరారు. ఆదివారం ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డిని కలిసి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లానింగ్ అప్రూవల్ బోర్డులో సమగ్ర శిక్ష ఉద్యోగుల జీతా లను తొమ్మిదేళ్ల కాలంలో పెంచడం కోసం ప్రపోజల్ పె ట్టలేదని, కావున ఈ సంవత్సరం సమగ్ర శిక్ష ఉద్యోగుల జీతాలను ప్రస్తుతం ఇచ్చే జీతాలను రెండింతల చేస్తూ ప్లానింగ్ అప్రూవల్ బోర్డులో ప్రపోజల్ పెట్టే విధంగా చేయాలని కోరారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సమగ్ర శిక్ష అసోసియేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా గౌరవ అధ్యక్షుడు అనుమల్ల శ్రీనివాస్, అధ్యక్షుడు బర్ల నారాయణ, ప్రధాన కార్యదర్శి కుడుకల రవీందర్, ట్రెజరీ చిట్యాల రవి, ఎండీ ఫారూఖ్, సమ్ర శిక్ష ఉ ద్యోగులు రాజేందర్, రాజ్ చందర్, రమేష్, బొడ్డు సురేష్, బి.శ్రీనివాస్, ఎన్.రాము, అభినయ్, కె.మహేష్ పాల్గొన్నారు.



ఎమ్మెల్సీకి శుభాకాంక్షలు తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

గొంతు కోసిన చైనా మాంజ.. తప్పిన ప్రాణాపాయం

మెట్‌పల్లి, జనవరి, 14 : పట్టణంలోని అంబేద్కర్ నగర్ కాలనీ చెందిన బట్టు శంకర్ గొంతుకు చైనా మాంజ తగిలి గొంతు కోసిన సంఘటన చోటు చేసుకుంది. ఆదివారం బట్టు శంకర్ కోరుట్ల పట్టణంలోని అల్లమయ్య గుట్టకు బంధువుల ఇంటికి బయలు దేరి వెళ్లాడు. ఈ క్రమంలో కోరుట్ల పట్టణం శివారులో చైనా మంజా గొంతుకు తగిలి కోసుకుపోయింది. శంకర్ బైక్ స్పీడ్ తక్కువగా ఉండ డంతో స్వల్ప గాయాలపాలైనాడు.

వెంటనే స్థానికులు గమనించి ఆసపత్రికి తరలించారు. దీంతో ప్రాణాపాయం తప్పింది. అదే ద్విచక్ర వాహనం స్పీడు ఉంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని ఆయన పేర్కొన్నారు.

క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

కొడిమ్యాల,జనవరి 14: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఆదివారం సాయంత్రం మండ లంలోని నమిలికొండ మైదానంలో సీనియర్ వాలీబాల్ క్రిడాకారుల స్మారకార్థం నమికొండ పోలీస్ బృందం నిర్వహిస్తున్న వాలీబాల్ క్రిడలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి క్రిడాకారులు క్రిడాస్ఫూర్తిలో ముందుకు నడువాలన్నారు. క్రిడాల వలన మానసికోల్లాసం పెరుగుతుం దన్నారు. నారాయణగౌడ్, మల్లిఖార్జున్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, రాజేం ధర్, సర్పంచ్‌లు అనీత నరేష్, శ్రీనివాస్‌రెడ్డి, నమికొండ పోలీస్ బృందాలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే ఆలయాల అభివృద్ధి

ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి


జగిత్యాలరూరల్, జనవరి 14 : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఆలయాలు అభివృద్ధి చెందాయని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని కన్నాపూర్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఎల్లమ్మతల్లి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఎల్లమ్మతల్లి ఆలయ నిర్మాణానికి కృషి చేస్తానని అన్నారు. ఎమ్మెల్సీ నిధుల నుండి రూ. 3 లక్షల నిధులు కేటాయిస్తానని పేర్కోన్నారు. అలాగే తన సొంత ఖర్చులతో ఆలయ నిర్మాణానికి సరిపడే కంకర సమకూరుస్తానని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఆలయాల అభివృద్ధిని నాయకులు పట్టించుకోలేదని విమర్శించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పొట్టవత్తిని సతీష్ కుమార్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



కన్నాపూర్‌లో ఎల్లమ్మతల్లి ఆలయ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ

వివేకానంద జయంత్యుత్సవాలు

పెగడపల్లి, జనవరి 14 : మండలంలోని ఏడుమోటలపల్లిలో ఆదివారం స్వామి వివేకానంద జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించారు. జయంతుత్స వాలను పురస్కరించుకుని గ్రామానికి చెందిన 6 నుంచి 10వ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్వామి వివేకానందుడి చిత్రపటానికి పూల మాలలు వేసి ప్రతిజ్ఞ చేశారు. సర్పంచ్ రవినాయక్, యువకులు రాజేందర్‌రెడ్డి, గంగాధర్, రమేష్ ఉన్నారు.







సిరిసిల్ల మానేరు రచయితల సంఘం ఆధ్వర్యంలో
పుస్తకాల బహూకరణ


హైదరాబాద్‌లో ఆకర్షణకు పుస్తకాలు అందిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సిరిసిల్ల రూరల్, జనవరి 14: హైదరాబాద్‌కు చెందిన అకర్షణ సతీష్‌కు ఆదివారం సిరిసిల్ల మానేరు రచయితల సంఘం ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చేతుల మీదుగా పిల్లల సాహితీ పుస్తకాలను బహూకరించారు. హైదరాబాద్‌లోని పబ్లిక్ స్కూల్‌లో చదువుతున్న ఆకర్షణ సతీష్ ఇప్పటి వరకు వివిధ ప్రాంతాల్లో పదికి పైగా గ్రంథాలయాలను ఏర్పాటు చేసి భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్రమోదీలతో సత్కారాలను పొందారు. ఆమెను ప్రోత్సహించేందుకు మానేరు రచయితల సంఘం (మారసం) వ్యవస్థాపకుడు డాక్టర్ పత్తిపాక మోహన్ వెయ్యి పిల్లల పుస్తకాలను అందించేందుకు సంకల్పించి బాల సాహిత్య పరిషత్ చొక్కపు వెంకటరమణ, దక్కన్ సాహిత్యసభ అబ్దుల్‌గనీలు మరికొన్ని పుస్తకాలు సమకూర్చగా వాటిని కేంద్ర మంత్రి చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో మారసం నిర్వాహక అధ్యక్షుడు ఎలగొండ రవి, బాలసాహిత్య పరిషత్ అధ్యక్షుడు చొక్కపు వెంకటరమణ, దక్కన్ సాహిత్య సభ కన్వీనర్ డాక్టర్ ఎస్‌కె అబ్దుల్‌గనీ పాల్గొన్నారు.

19 నుంచి జాతీయ స్థాయి ఫిడే రేటింగ్ చదరంగ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 14: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని విశ్వనాథ్ చెస్ అకాడమి ఆధ్వర్యంలో ఈనెల 19, 20, 21తేదీల్లో జాతీయ స్థాయి ఫిడే రేటింగ్ చదరంగ పోటీలను నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని వైశ్యభవన్‌లో అండర్-1600 ఫిడే రేటింగ్ కలిగిన చదరంగ క్రీడాకారులకు ఈ పోటీలను అఖిల భారత స్థాయిలో నిర్వహించనున్నామని పోటీల నిర్వహణ కమిటి సభ్యులు బి రమణారావు, అంతగిరి రాజేంద్రప్రసాద్, చెరుకు ప్రద్యుమ్నకుమార్, రాజభాను, ఎ విశ్వనాథ్ ప్రసాద్ తెలిపారు. జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ స్థాయి చదరంగ పోటీలు నిర్వహించడం ఇదే మొదటిసారి అని వివరించారు. ఈ పోటీలకు అంతర్జాతీయ సమాఖ్య, అల్ ఇండియా చెస్ ఫెడరేషన్ గుర్తింపు ఉందన్నారు. చెస్ పోటీలను 9 రౌండ్లలో స్విస్, లీగ్ పద్ధతిలో నిర్వహించనున్నామని చెప్పారు. గెలుపొందిన క్రీడాకారులకు రెండు లక్షల రూపాయల నదగు బహుమతులను అందచేస్తామని తెలిపారు. ఓపెన్ కెటగిరిలో 20 నగదు బహుమతులు, అండర్-1,200, అండర్-1,400 రేటింగ్ కేటగిరిలో 10 నగదు బహుమతులను, అన్ రేటెడ్ క్రీడాకారులకు 5, వెటరన్ విభాగంలో 5 నగదు బహుమతులను అందజేస్తున్నామని తెలిపారు. వీటితోపాటు బాల, బాలికలకు అండర్-9, 11, 13, 15 విభాగాలలో పోటీలను నిర్వహించి, నగదు బహుమతులతోపాటు ప్రత్యేక బహుమతులను అందచేస్తామని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈనెల 17లోపు తమ ఎంట్రీలను 9030177607నంబరుకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని సూచించారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి 'ఖని' ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్


దినేష్

కోల్‌సిటీటౌన్, జనవరి 14: కేంద్ర ప్రభుత్వ యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేది నుంచి 20వ తేది వరకు హైదరాబాద్‌లో జరిగే జాతీయ సమైక్యతా శిబిరానికి గోదావరిఖని యూనివర్సిటీ పీజీ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ కళ్యాణం దినేష్ ఎంపికయ్యాడు. ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న దినేష్ ఎంఎల్ఆర్ ఇన్‌స్టూట్ ఆఫ్ టెక్నాలాజీలో జరిగే శిబిరంలో పాల్గొంటాడు. దేశంలోని 12 రాష్ట్రాల నుంచి వివిధ యూనివర్సిటీలకు చెందిన ఎన్‌ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొనే శిబిరంలో కళాశాల నుంచి దినేష్ పాల్గొనడం విశేషం. కాగా కళాశాల చెందిన విద్యార్థి జాతీయ సమైక్యతా శిబిరంలో పాల్గొనడం పట్ల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రమాకాంత్, అధ్యాపకులు సురేష్‌కుమార్, రవి, సావిత్రి, అజయ్, యాదయ్య, సల్మాసుల్తానా, అజీజ్, ఎన్‌ఎస్‌ఎస్ పీవో డాక్టర్ వై.ప్రసాద్, శాతవాహన యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మనోహర్ అభినందించారు.

చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు

కోల్‌సిటీ, జనవరి 14: నిబంధనలకు విరుద్ధంగా చైనా మాంజా విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం సీపీ రెమరాజేశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. చైనా మాంజా వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, గాలిపటాలు ఎగురవేసే క్రమంలో పక్షులతో పాటు సాధారణ ప్రజలు ప్రమాదానికి గురవుతున్నారని తెలిపారు. గాలిపటాలు ఎగురవేసే వ్యక్తులు కూడా ప్రమాదాలకు గురైన సందర్భాలున్నాయని చెప్పారు. దీంతో చైనా మాంజాను రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించిందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ చట్టం 1986ప్రకారం మాంజా అమ్మినా, కొనుగోలు చేసినా నేరమని, ఏడేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధించనున్నామని తెలిపారు. చైనా మాంజా విక్రయించే దుకాణాలపై తనిఖీలు ఉంటాయని తెలిపారు.

కుక్కల దాడిలో పలువురికి గాయాలు


గాయపడ్డ శ్రీచరణ్, దేవయ్య

సిరిసిల్ల రూరల్, జనవరి 14: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు గ్రామంలో ఆదివారం కుక్కలు స్వైర్య విహారం చేసి గ్రామస్థులపై దాడులు చేయడంతో ముగ్గురు గాయాలకు గురయ్యారు. గ్రామానికిచెందిన మూడు సంవత్సరాల శ్రీచరణ్ అనే బాలుడితో పాటు గీతా కార్మికుడైన వంగ దేవయ్య గౌడ్, దానవేని ఎల్లవ్వలు రోడ్డుపై నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. వెంటనే గాయపడ్డ వారిని గ్రామస్థులు సిరిసిల్ల జిల్లా అసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. గ్రామంలో కుక్కల బెడదను నివారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గాలిపటం ఎగురవేస్తూ గాయపడిన బాలుడు

కొడిమ్యాల, జనవరి 14: మండలంలోని బొల్లోని చెరువు గ్రామానికి చెందిన చెల్ల రిషిత్ అనే 11 ఏళ్ల బాలుడు ఆదివారం గాలిపటం ఎగురవేస్తుండగా వెనుకకు నడుస్తూ కిందపడి గాయపడ్డాడు. చేతికి బలమైన గాయమైంది. గాయపడిన బాలుడిని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కృష్ణారావు పరామర్శించారు. ఆయన వెంట ఉప సర్పంచ్ రమేష్, బీఆర్ఎస్ నాయకుడు లక్ష్మణ్ రెడ్డి, మల్లయ్య, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కోల్‌సిటీ, జనవరి 14: గోదావరిఖని మార్కండేయకాలనీలో నివాసముండే సీతారాం అనే ప్రైవేట్ లెక్చరర్ ఇంట్లో చోరీ జరిగింది. తాళం వేసి ఉన్న ఇంట్లో చొరబడిన గుర్తు తెలియని వ్యక్తులు 3తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. సీతారాం కుటుంబ సభ్యులతో ఈ నెల 1వ తేదిన హైదరాబాద్‌కు వెళ్లాడు. గేట్‌కు తాళం వేసి ఉండడంతో ఇంట్లో చొరబడిన దొంగలు ఇంట్లోని ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితుడు గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మేడిపల్లి, జనవరి 14: మేడిపల్లి మండల కేంద్రంలోని పెట్రోల్ పంపు వద్ద ఆది వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. కాచారం గ్రామానికి చెందిన కొప్పెర మోహన్‌రెడ్డి (54) అను వ్యక్తి ఏపీ 15 బీసీ 6561 గల హెచ్ఎఫ్ డీలక్స్ పై పెట్రోల్ పంపు వైపు రోడ్డు దాటుతుండగా జగిత్యాల నుంచి కోరుట్ల వైపు వెలుతున్న కారు ఏపీ 25 ఏ ఎల్ 0477 నెంబర్ గల కారు ఢీకొట్టి, రెండు కాళ్లపై నుంచి వెళ్లడంతో మోహన్ రెడ్డి తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సంఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు.

నిందితుడి అరెస్ట్



అరెస్ట్ చూపుతున్న సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్

సిరిసిల్ల క్రైం, జనవరి 14: గంభీరావుపేట మండలంలోని లింగన్నపేట గ్రామానికి చెందిన అంబటి శ్రీకాంత్(35) అనే నిందితుడిని అరెస్ట్ చేశామని సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్ తెలిపారు. ఆదివారం సిరిసిల్లలోని రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇతను ముస్తాబాద్ మండల కేంద్రంలోని బిట్ల వెంకటేశ్‌కు చెందిన ఇంటికి ఈనెల 11న అర్ధరాత్రి వెళ్లి తాళం పగులగొట్టి లోపలికి చొరబడి బీరువాలోని ఏడు తులాల బంగారు అభరణాలు, 12 తులాల వెండి అభరణాలు, రూ. 45 వేలు ఎత్తుకెళ్లాడని తెలిపారు. ఈ సంఘటనపై ముస్తాబాద్ ఎస్‌ఐ కె. శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందంగా ఏర్పడి ఆధునిక సాంకేతికత , సీసీ కెమెరాల ఆధారంగా 24గంటల్లో చోరీచేసిన దొంగను చేధించి పట్టుకున్నారన్నారు. నిందితుడు శ్రీకాంత్‌ను పట్టుకొని విచారించగా చోరీచేసినట్లు అంగీకరించాడ ని, ఇతని వద్ద రూ. 31వేల నగదు, పల్సర్ బైక్, దొంగిలించిన సొమ్మును స్వాధీనం పరుచుకొని రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు.

చెప్పుల దుకాణం దగ్ధం



దగ్ధమవుతున్న దుకాణం

మల్యాల, జనవరి 14: దిగువ కొండగట్టులో గల చెప్పుల దుకాణం షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధం అయింది. శంకర్‌కు చెందిన చెప్పుల దుకాణంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగగా స్థానికులు మంటలు ఆర్పివేశారు. దుకాణంలోని మూడు లక్షల రూపాయలకు పైగా విలువైన చెప్పులు కాలి బూడిద అయ్యాయి. కాగా డబ్బాలో గల రూ.1.50లక్షల నగదు సురక్షితంగా ఉండగా మంటలను ఆర్పివేసిన అనంతరం వాటిని బయటకు తీశారు.

రాజకీయాల కోసం దేవుడినీ వదలడం లేదు

● ప్రశ్నించిన వారిపై హిందూ వ్యతిరేకులుగా ముద్ర ● రాముడు కొందరి వాడు కాదు.. అందరివాడు ● రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



కరీంనగర్‌లో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడ/కరీంనగర్ అర్బన్, జనవరి 14: రాజకీయ లబ్ధి కోసం, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు కోసం కొందరు దేవుడిని కూడా వదలడం లేదని, అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్నారని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఆదివారం ఆయన కుటుంబ సమేతంగా వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఏ రాజకీయ నాయకుడు కూడా దేవాలయాలు ప్రారంభోత్సవం చేయరని, విగ్రహ ప్రతిష్ఠ, శిలాన్యాస కార్యక్రమాలు పాలకుల చేతుల మీదుగా కాకుండా పీఠాధిపతుల చేతుల మీదుగా చేస్తారని గుర్తు చేశారు. ఆలయ నిర్మాణం పూర్తి కాలేదని జగద్గురువులు చెబుతున్న విషయాన్ని ప్రతీ ఒక్కరు గమనించాలన్నారు. అలయ నిర్మాణం పూర్తి కాకున్నా, ప్రారంభోత్సవానికి సరైన సమయం కాకున్నా వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రజల దృష్టి మళ్లించి మరోసారి అధికారంలోకి వచ్చేందుకు ఈ అంశాన్ని వాడుకుంటున్నారని విమర్శించారు. వీటన్నింటినీ ప్రశ్నించిన తమపై హిందువులకు వ్యతిరేకమనే ముద్ర వేస్తున్నారని, హిందుత్వాన్ని విశ్వసించే వారు ఈ పరిణామాలపై ఆలోచన చేయాలని, దేవుడు కొందరి వాడు కాదు అందరి వాడని, కులం, ధనం, అధికారం పదవులతో సంబంధం లేకుండా రాముడు, శివుడు, హన్మంతుడిని ప్రతీ ఒక్కరూ కొలుస్తారని అన్నారు. పార్లమెంటులో అదానీ, అంబానీకి సంబంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక రాముడిని ముందుకు తీసుకువచ్చి ఎన్నికల్లో గెలిచే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మండల్ కమిషన్‌తో పేదలకు, బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేసేందుకు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేసిందని, కమండల్ కమిషన్‌తో వాళ్లు ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

● రాజన్న ఆలయ అభివృద్ధికి కృషి..

రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, రైతులు, ప్రజలు బాగుండాలని రాజరాజేశ్వరస్వామి వారిని కోరుకున్నానని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వేములవాడ ఆలయ అభివృద్ధిపై తదుపరి చర్యల కోసం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించామని, మహాశివరాత్రి కంటే ముందే ఈనెల 30వ తేదీలోగా వీటీడీఏ మీటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. రాజరాజేశ్వర స్వామివారి భక్తులుగా ఆలయ అభివృద్ధి బాధ్యత తమపై ఉందని, ఎవరూ ప్రశ్నించకముందే వేములవాడ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

● కరీంనగర్‌లో జర్నలిస్టులతో చిట్‌చాట్ అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ ఎన్నికల ఖర్చుకు మంగళసూత్రాలు అమ్ముకున్నానని చెప్పిన బండి సంజయ్ ఐదేళ్లలో ఏ ఊరులో చూసినా లక్షల రూపాయల పెద్దపెద్ద కట్‌అవుట్స్ పెట్టుకుంటున్నాడని, ఈ డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయన్నారు. కరీంనగర్ లోక్‌సభ సీటు కాంగ్రెస్ గెలుచుకుంటుందని, గత ఎన్నికల్లో మతంపేరిట, ఆస్కార్ అవార్డు తరహాలో నటన చేశాడు కాబట్టి గెలిచాడని, ఈసారి అలా కానివ్వమన్నారు. జిల్లాకు ప్రస్తుత ఎంపీ బండి సంజయ్, మాజీ ఎంపీలు వినోద్‌కుమార్, కేసీఆర్‌లు ఏ పథకాలు, ఏ మేర నిధులు తీసుకువచ్చారో చెప్పాలన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు రైల్వేలైన్, మోడల్‌స్కూల్, పాస్‌పోర్ట్ కార్యాలయం, కేంద్రీయ విద్యాలయం, ఎఫ్‌ఎం రేడియో, ఎలగందుల టూరిజం వంటివి పథకాలను, నిధులను తీసుకవచ్చానని, దీనిపై చర్చకు సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. ప్రస్తుత ఎంపీ ఐదేళ్లలో చేసిన ఒక్క పని చెప్పమనండి అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌పార్టీ దేశాభివృద్ధికి కూడబెట్టిన కేంద్ర సంస్థలను బీజేపీ ప్రభుత్వం అమ్ముతోందని అన్నారు. కేటీఆర్‌కు అధికారం పోయిన బాధలో ఉన్నాడని, పదవిలో నుంచి దిగిపోతారని ఎప్పుడూ కలలో కూడా ఊహించలేదని అందుకే అసహనంలో ఉన్నాడన్నారు.

రాజన్న సేవలో మంత్రి పొన్నం

వేములవాడ, జనవరి 14: రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి సేవలో తరించారు. ఆదివారం ఉదయం ఆయన కుటుంబ సమేతంగా శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు సాంప్రదాయబద్ధంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొని, కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అర్చకులు వేద పండితులు ఆశీర్వదించగా, ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ స్వామివారి ప్రసాదం అందజేశారు. అంతకుముందు రాజన్న ఆలయం ముందు ఆయనకు ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం కోసం వచ్చిన మంత్రి పొన్నంకు స్థానిక ఆర్డీవో మధుసూదన్, డీఎస్పీ నాగేంద్రచారి తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, నాయకులు చిలుక రమేష్, కూస రవీందర్ సంగీతం శ్రీనివాస్, తూమ్ మధు, పాత సత్యలక్ష్మి, పులి రాంబాబు, చందుర్తి జెడ్పిటిసి సభ్యుడు నాగం కుమార్, స్థానిక నాయకులు ఉన్నారు.



కోడెమొక్కు చెల్లించుకుంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్

వీరభద్రనామస్మరణతో మార్మోగిన కొత్తకొండ

● జాతరలో భక్తుల కిటకిట
● గుమ్మడికాయలు, కోరమీసాలు చెల్లించుకున్న భక్తులు



జాతరకు వస్తున్న కుమ్మర్ల ఎడ్లబండ్లు



గుమ్మడికాయ మొక్కులు చెల్లిస్తున్న యువతులు

భీమదేవరపల్లి, జనవరి 14: వీరభద్రా... శరభా... శరభా.... అంటూ భక్తుల శరణుఘోషతో కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయం మార్మోగింది. భక్తుల వీరభద్రస్వామి నామస్మరణతో పులకించిపోయింది. ఉత్తర తెలంగాణ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన కొత్తకొండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా భోగి పండుగను పురస్కరించుకొని ఆదివారం భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. శీఘ్ర దర్శనం, ప్రత్యేక దర్శనం, వీఐపీ దర్శనం, సర్వ దర్శనం ఇలా అన్ని క్యూలైన్లు భక్తాజనంతో కిక్కిరిసిపోయాయి. ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలు వీరభద్ర నామస్మరణతో మార్మోగాయి. పవిత్ర కోనేరులో స్నానాలచరించిన అనంతరం పుట్టు వెంట్రుకలు అప్పజెప్పి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల తాకిడికి క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. దర్శనం కోసం భక్తులు మూడు నుంచి నాలుగు గంటల పాటు వేచి చూశారు. కోరిన కోర్కెలు తీర్చాలని కోడెలను కట్టారు. స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన కోరమీసాలు, గుమ్మడి కాయలు భక్తులు అప్పజెప్పారు. తమ గండాలు తొలగాలని గండాదీపంలో నూనె పోశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో కిషన్‌రావు, జాతర చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్, దేవాదాయ శాఖ ఏసీ సునీతలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్, ఎల్కతుర్తి సీఐ ప్రవీణ్‌కుమార్, ముల్కనూర్, వంగర ఎస్‌ఐలు సాయిబాబు, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 400 మంది పోలీసులు బందోబస్తును నిర్వహించారు. ముల్కనూర్ ఏకేవీఆర్ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, విద్యార్థులు 50 మంది జాతరలో పలు సేవలందించారు. ఆలయ ఈవో కిషన్‌రావు జాతరకు పాలకవర్గ కమిటీ లేకపోవడంతో అన్ని తానై ఏర్పాట్లను పర్యవేక్షించాడు. సీఎం ఓఎస్‌డీ వేముల శ్రీనివాస్‌లు జాతరకు వచ్చి స్వామివారికి గుమ్మడికాయ మొక్కులు, కోరమీసాల మొక్కులు చెల్లించారు.

భోగి పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు...

భోగి పండుగను పురస్కరించుకొని స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి సూర్యయంత్ర ప్రతిష్ఠాపన, అరుణ పారాయణం, సూర్య నమస్కారాలు, మహాన్యాసపూర్వ రుద్రాభిషేకం, పుణ్యాహవచనం నిత్య బలిహరణ, అమ్మరికి శ్రీచక్రార్చన, నవావరణ పూజ చండీహోమం నిర్వహించారు. భోగి పండుగను పురస్కరించుకొని నందీశ్వర పూజలు చేశారు.

కుమ్మరుల బోనాలతో ప్రారంభమైన ఎడ్లబండ్లు...

ప్రతీ ఏడాది బ్రహ్మోత్సవాలలో కుమ్మరులు బోనాలను వండి తమ ఎడ్లబండ్లను ప్రదక్షిణలు చేసిన తర్వాతరోజు నుంచి ఎడ్లబండ్ల కార్యక్రమం జరగడం ఆనవాయితీగా వస్తుంది. దీంట్లో భాగంగా కుమ్మరులు ఆదివారం సాయంత్రం బోనం గద్దె వద్ద వీరభద్రుడికి వీరబోనం చేశారు. కుమ్మరులు బోనాలను నెత్తిన పెట్టుకొని వీరభద్రుడికి ఇష్టమైన ప్రభలతో వెళ్తుండగా శివసత్తులు వీరబోనంతో గటంకుండతో నృత్యాలు చేశారు. వీటివెనుక అందంగా అలంకరించిన ఎడ్లబండ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలుచేసి కుమ్మరులు వీరభద్రుడిని దర్శించుకున్నారు. గద్దె వద్ద బోనం సమర్పించారు. కడిపికొండ, ఉల్లిగండ దామెరకు చెందిన మహిళలు గుమ్మడికాయలను ఎత్తుకొని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు.

మోదీ పాలనలో ఆర్థిక తిరోగమనం

- ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి



స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ, నాయకులు

జగిత్యాల టౌన్, జనవరి 14: మోదీ పాలనలో భారతదేశం ఆర్థిక తిరోగమనంలోకి వెళ్లిందని ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారత్ జోడో న్యాయ యాత్ర పోస్టర్లను, వాల్ స్టిక్కర్లను నాయకులతో కలిసి జీవన్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. బీజేపీ పాలనలో దేశం ఆర్థికంగా తిరోగమనం చెందడంతో పాటు నిత్యావసర సరుకుల ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరించిందన్నారు. ప్రతీ పేదవాడి బ్యాంకు ఖాతాలో రూ. 15 లక్షల వేస్తామని చెప్పిన మోదీ ప్రభుత్వం కనీసం 15 రూపాయలు కూడా వేయలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలనలోనే ప్రతీ పేదవాడికి న్యాయం జరిగిందన్నారు. రాహుల్ గాంధీ చేపడుతున్న భారత్ జోడో న్యాయ యాత్రను ప్రజలు, నాయకులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కమటాల శ్రీనివాస్, గుండ మధు తదితరులు ఉన్నారు.

రాయికల్ టు అయోధ్య

- సైకిల్ యాత్రకు బయలుదేరిన యువకులు



అయోధ్యకు సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్న యువకులు

రాయికల్, జనవరి 14: అయోధ్యలో ఈ నెల 22న శ్రీరామచంద్ర ప్రభువు విగ్రహ రూపంలో ప్రాణప్రతిష్ఠ కానుండటంతో రాయికల్‌కు చెందిన యువకులు గుండేటి మాధవ్, నల్లూరి వరుణ్ రాయికల్ నుంచి అయోధ్యకు సైకిల్ యాత్రను చేపట్టారు. రాయికల్ హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అయోధ్య వరకు సైకిల్ యాత్రతో బయలుదేరారు. రామమందిరం నిర్మాణమైతే రాయికల్ నుంచి సైకిల్ యాత్ర నిర్వహిస్తామని మొక్కుకున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ యాత్ర సుమారు 1150 కిలో మీటర్లు ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా శ్రీరాముని భగవాధ్వజాన్ని ఊపి యాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ తురగ శ్రీధర్ రెడ్డి, రాకేష్ నాయక్, శ్రీరామ తీర్థ క్షేత్ర సమితి బాధ్యులు తురగ రాజరెడ్డి, కాయితి గంగాధర్, వేల్పుల స్వామి యాదవ్, దొంగ జితేందర్ రెడ్డి, బొమ్మకంటి రాంగోపాల్ జీ, బొడుగం మోహన్ రెడ్డి, గాజెంగి అశోక్, కుర్మ మల్లారెడ్డి, తోపారపు రవీందర్, గన్నవరం గంగాధర్, వాసం జలంధర్, మామిడాల లక్ష్మీనారాయణ, శ్రీగద్దె సుమన్ పాల్గొన్నారు.

వైభవంగా గోదారంగనాయకుల కల్యాణం

వేములవాడ, జనవరి 14 : శ్రీరంగనాయకస్వామి, గోదాదేవిల దివ్య కల్యాణం వేములవాడలో ఆదివారం సాయంత్రం వైభవంగా జరిగింది. రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అనుబంధ వేణుగోపాల స్వామివారి ఆలయంలో ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ నేతృత్వంలో అర్చకులు, వేదపండితుల బృందం రంగనాయకస్వామి, గోదాదేవిల ఉత్సవమూర్తులను స్వామివారి కల్యాణ మంటపంలో అందంగా అలంకరించి వివాహ మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ హరిహరనాథ్, ఆలయ సిబ్బంది, భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించి తరించారు.

● కొండగట్టులో..

మల్యాల: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో ఆదివారం గోదారంగనాథుల కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ప్రత్యేకించి అలంకరించిన వేదికపై ఉత్సవమూర్తులకు కల్యాణాన్ని శాస్త్రోక్తంగా వేదమంత్రోచ్ఛరణలు మధ్య కల్యాణాన్ని ఆలయ అర్చకులు, వేదపండితులు వైభవంగా జరిపారు. కల్యాణానికి ఆలయ అధికారులు పట్టు వస్త్రాలను స్వామి వారికి సమర్పించారు. కల్యాణం సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈవో వెంకటేష్, ఫౌండర్‌ట్రస్టీ మారుతీస్వామి, ఏఈవో బుద్ది శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, సునీల్ ఆలయ స్థానాచార్యులు కపీందర్, ప్రధానర్చకులు జితేంద్రప్రసాద్, రామకృష్ణ, రఘు టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు సంపత్, లక్ష్మారెడ్డి అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.





వేములవాడ, కొండగట్టులో గోదారంగనాయకుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

విద్యుత్ మోటర్లు దొంగిలించి

ఇనుప సామాను షాపుల్లో విక్రయం?

బీర్‌పూర్, జనవరి 14: పంటపొలాల్లో నీరు పారించడం కోసం రైతులు ఉపయోగించే విద్యుత్ మోటర్లు వరుసగా చోరీకి గురవుతున్నాయి. దీంతో పోలీసులు రంగంలోకి దిగి దర్యాప్తు జరుపుతున్న క్రమంలో పొరుగు జిల్లాలోని ఓ మండల కేంద్రంలో పోలీసులు దొంగలను పట్టుకున్నట్లు సమాచారం. అయితే మోటర్లు ఎత్తుకెళ్లి సమీప మండల కేంద్రంలోని ఓ పాత ఇనుప సామాన్లు కొను గోలు చేసే షాపుల్లో విక్రయించినట్లు దొంగలు ఒప్పుకున్నట్లు చర్చ జరుగుతోంది.

మండలంలో రైతులకు నిద్రపట్టకుండా చేసిన దొంగలు దొరికారన్న వార్త తెలియడంతో ఇటీవల జరిగిన దొంగతనాలకు కారకులు వీరేనా అనే చర్చ మండలంలో జరుగుతోంది. నూతన సంవత్సరం రోజున శాంతిస్థూపం సమీపంలో గల కిరాణం షాపునకు అమర్చిన ఇనుప జాలీని కట్ చేసి సామగ్రి దొంగిలించారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు సీసీ కెమెరాలు ఉంటే దొంగలు కచ్చితంగా దొరికి ఉండేవారని చర్చించుకుంటున్నారు.

కబడ్డీ... కబడ్డీ

- ముగిసిన కబడ్డీ శిక్షణ శిబిరం
- శిక్షణలో జాతీయ, రాష్ట్ర కబడ్డీ క్రీడాకారులు

సిరిసిల్ల టౌన్, జనవరి 14: గ్రామీణ ప్రాంతాల్లోని కబడ్డీ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. రాష్ట్రంలో జిల్లా, మండల స్థాయిలో కబడ్డీ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలను నిర్వహిస్తూ ప్రతిభ ఉన్న క్రీడాకారులను రాష్ట్ర, జాతీయ స్థాయి జట్టులో అవకాశాలు వచ్చే విధంగా ప్రత్యేక శిక్షణలను నిర్వహిస్తూ క్రీడాకారులలో నైపుణ్యానికి పదును పెడుతున్నారు. ఈ నెల 2న సిరిసిల్ల పట్టణంలో కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జూనియర్ కబడ్డీ బాలబాలికల ఎంపికల పోటీలో ప్రతిభ ఉన్న క్రీడాకారులను రాజన్న సిరిసిల్ల జిల్లా బాలబాలికల జట్లను ఎంపిక చేశారు. సిరిసిల్ల పట్టణం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడామైదానంలో కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నిపుణులైన కోచ్‌ల ద్వారా బాలబాలికల జిల్లా కబడ్డీ జట్లకు శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. కబడ్డీ శిక్షణ శిబిరంలో బాలబాలికల జిల్లా జట్లలో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులు కూడా పాల్గొన్నారు. శిక్షణశిబిరం ద్వారా క్రీడా నైపుణ్యం, జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఎంపికైన క్రీడాకారులతో పరిచయాలు, స్నేహం వారితో అనుబంధాలను వివరించారు. గత గురువారం మెదక్ జిల్లా గజ్వేల్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొనడానికి జిల్లా బాలబాలికల జట్లు సిరిసిల్ల నుంచి తరలివెళ్లాయి.



కబడ్డీ బాలబాలికల జట్లతో నాయకులు

టీ షర్ట్స్ పంపిణీ..

జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిరిసిల్ల ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా మైదానాంలో కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా జూనియర్ కబడ్డీ బాలబాలికల జట్లలోని క్రీడాకారులకు టీ షర్ట్స్‌ను అసోసియేషన్ జిల్లా చైర్మన్ జిందం చక్రపాణి, వైస్ చైర్మన్ కోడి అంతయ్య అందజేశారు.

శిక్షణ శిబిరాలు ప్రావీణ్యాన్ని పెంచుతాయి



- ఎండీ సానా, జాతీయ స్థాయి క్రీడాకారిణి

కబడ్డీ శిక్షణ శిబిరాలు క్రీడాకారులలో మరింత ప్రావీణ్యాన్ని పెంచు తాయి. మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి టోర్నమెంట్స్ నిర్వహిం చాక ఎంపికైన జట్ల సభ్యులకు ఖచితంగా శిక్షణ శిబిరాలను నిర్వహిం చాలి. శాతవాహన యూనివర్సిటీ నుంచి చెన్నయ్‌లో ఒకసారి కదయ్‌కుడిలో రెండోసారి జాతీయ స్థాయి పోటీలో పాల్గొన్నాను. ఎనిమిది సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాను.

ప్రభుత్వం కబడ్డీ క్రీడను ప్రోత్సహించాలి

- జీ పావని, జాతీయ స్థాయి క్రీడాకారిణి



కబడ్డీ క్రీడను ప్రభుత్వం మరింతగా ప్రోత్సహించాలి. గ్రామీణ ప్రాంతాలలో క్రీడామైదానాలు లేవు. ఉన్న క్రీడా మైదానాలలో సౌకర్యాలు లేక పోవడంతో నైపుణ్యం ఉన్నా క్రీడాకారులు వెలుగులోకి రావడం లేదు. మా వ్యాయామ ఉపాధ్యాయులు, కబడ్డీ అసోసియేషన్, కోచ్‌ల ప్రోత్సాహంతో ఈ స్థాయికి వచ్చాము. తమిళనాడు మధురైలో జరిగిన కబడ్డీ పోటీలలో శాతవాహన యూనివర్సిటీ నుంచి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు, ఏడు సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాను.

ఆకట్టుకున్న సంక్రాంతి ముగ్గుల పోటీలు

జగిత్యాల టౌన్, జనవరి 14 : జిల్లా కేంద్రంలోని 8వ వార్డులో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. మహిళలు, యువతులు పోటీ పడి ముగ్గులు వేయగా పట్టణానికి చెందిన సరోజిని, మాధవిలు విజేతలుగా నిలువగా కౌన్సిలర్ మల్లవ్వ తిరుమలయ్య చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం ప్రముఖ గాయకుడు అభి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బేడబుడుగ జంగాల కాలనీ నాయకులు ఉన్నారు.

రాయికల్: రాయికల్ మండలంలోని వీరాపూర్ గ్రామంలో కౌండిన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో పద్మావతి, గ్రామ సర్పంచ్ నీలి చిన్న మల్లయ్య, యూత్ అధ్యక్షుడు బండి వినోద్, ఉపాధ్యక్షులు పల్లె శశి, కోశాధికారి అమరగొండ శ్రావణ్, కార్యదర్శులు దొమ్మాటి వెంకటేష్, దిండిగల సాయి పాల్గొన్నారు. అలాగే మైతాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు మాజీ జడ్పీటీసీ గోపి మాధవిరాజరెడ్డి బహుమతులు అందజేశారు.

కొడిమ్యాల: మండలంలోని హిమ్మత్‌రావుపేట గ్రామంలో పాలకేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో మహిళలు, చిన్నారులు పాల్గొని ముగ్గులను ప్రదర్శించారు. ప్రతిభ కనబరిచిన ముగ్గురికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను జడ్పీటీసీ ప్రశాంతి, సర్పంచ్ పునుగోటి కృష్ణారావు, తిర్మలాపురం సింగిల్ విండో చైర్మన్ పోలు రాజేందర్ బహుమతులను అందజేశారు. పాల కేంద్రం నిర్వాహకులు ఆరె సాగర్, కేంద్రం ఉపాధ్యక్షులు నర్సయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

ఊరేగింపుగా అయోధ్య రామయ్య అక్షింతలు



అక్షింతలను వితరణ చేస్తున్న సర్పంచ్

వెల్గటూర్, జనవరి 14: రాజక్కపల్లిలో అయోధ్య రాముల వారి అక్షింతలను ఆదివారం సర్పంచ్ బోడకుంటి రమేష్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు వితరణ చేశారు. అయోధ్య రామయ్య పూజిత అక్షితలను గడప గడపకు పంపిణీ చేశారు. మహిళలు అక్షితలకు మంగళ హారతులతో ఎదురేగి అక్షింతలను భక్తి శ్రద్ధలతో కళ్లకు అద్దుకుని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి వెంకటేష్, వార్డు సభ్యులు సురేష్, శ్రీనివాస్, నాయకులు చంద్రశేఖర్, రాజన్న, సంతోష్, సైరి యూత్ సభ్యులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

కట్కాపూర్‌లో వ్యాసరచన పోటీలు

రాయికల్, జనవరి 14: నెహ్రూ యువ కేంద్రం సహకారంతో యంగ్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో మండలంలోని కట్కాపూర్ గ్రామంలో వివేకానంద జయంతి సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వివేకానంద యువతకు స్ఫూర్తిదాయకమని, వారిని ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలని అన్నారు. అనంతరం గెలుపొందిన విజే తలకు మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పద్మసుధాకర్ రెడ్డి, యంగ్ స్టార్ యూత్ అధ్యక్షుడు బట్టు రంజిత్, ఎన్‌వైకే వాలంటీర్ చింత అనిల్, ముద్దసాని రాజు, దావన్‌పెల్లి లక్ష్మణ్, ఆంజనేయులు, పదం మహేందర్, కాశవేణి రాజేందర్ పొనకంటి మహేష్, గుడిపెల్లి అంజి, సిద్ధార్థ, సురేష్, శ్రావణ్, సాయిరాం, మనోజ్, సలం మహేష్, నితిన్, గణేష్ పాల్గొన్నారు.

విజేతలకు ట్రోఫీల అందజేత



ట్రోఫీలతో క్రికెట్ టోర్నమెంట్ విజేతలు

వెల్గటూర్, జనవరి 14: మండలంలోని జగదేవ్‌పేట గ్రామంలో మానుపాటి రవీంధర్ జ్ఞాపకార్థం ఆయన మిత్ర బృందం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. పోటీలను ఎంపీపీ లక్ష్మి లింగయ్య, సర్పంచ్ గాగిరెడ్డి లింగమ్మ రాజేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ముఖ్య అతిథి గా హాజరైన బీఎస్పీ నియోజకవర్గ ఇంచార్జి నక్క విజయ్ కుమార్ విజేత లకు ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తిరుపతి రెడ్డి, బీఎస్పీ మండల అధ్యక్షుడు బచ్చల స్వామి, వార్డు సభ్యుడు బచ్చల సుమ న్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నల్ల తిరుపతి పాల్గొన్నారు.

గాయపరిచిన వ్యక్తిపై కేసు నమోదు

వీణవంక, జనవరి 14: మండలంలోని బేతిగల్ గ్రామానికి చెందిన మద్దిమల్ల తరుణ్‌ను అదే గ్రామానికి చెందిన కొయ్యాడ సిద్ధార్థ్ బూతులు తిడుతు గాయపరిచాడని చేసిన ఫిర్యాదు మేరకు అతడిపై కేసు నమోదు చేశామని ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. తరుణ్ పాఠశాల ఆవరణలో ఉండగా అకారణంగా ముక్కుపై కడెంతో దాడి చేయగా గాయమైందని బాధితుడు ఫిర్యాదు చేశాడని ఎస్సై తెలిపారు.

అంగరంగ వైభవంగా..

గోదాదేవి రంగనాథుల కల్యాణం

కోరుట్ల, జనవరి 14 : పట్టణంలోని పురాతన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా రంగనాథులు గోదాదేవి కల్యాణం కమనీయంగా జరిగింది. ఉత్సవ మూర్తులకు అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తుల కోలాటాలు, చిన్నారుల నృత్యాలు, భజన మండలి వారి భజనలు ఆకట్టుకున్నాయి. కల్యాణం ఆలయ ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జువ్వాడి నర్సింగరావు, కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు దంపతులు, పుప్పాల ప్రభాకర్, ఈవో విక్రమ్, తిరుమల గంగాధర్, జూనియర్ అసిస్టెంట్ నర్సయ్య, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: సంక్రాంతి పండున అందరి జీవితాల్లో క్రాంతి నింపాలని కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఆకాంక్షించారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మెట్‌పల్లి పట్టణంలోని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం గోదాదేవి రంగనాథుల కల్యాణాన్ని విద్యాసాగర్‌రావు, సరోజ దంపతులు వైభవంగా నిర్వహించారు. పురోహితులు నరసింహమూర్తి, రమాకాంత్‌ల బృందం ఉత్సవమూర్తులకు ఫల పంచామృతాభిషేకాలు, పూజలు, హారతి వంటి తదిర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పురోహితుల వేదమంత్రతోవాలతో అంగరంగ వైభవంగా గోదా రంగనాధుల కల్యాణం జరిపారు. కల్యాణంలో వారి కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, పాల్గొని

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణంలో పాల్గొన్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

తిలకించి స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలోని ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామి వారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు.

పెగడపల్లి: మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం గోదారంగనాయకుల కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. మకర సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా బోగి పండుగ వేళ గోదాదేవి, రంగనాయకుల ఉత్సవమూర్తులను అందంగా అలంకరించిన వేదిక పైన ఉంచి వేద పండితులు గుండి శ్రీనివాస శర్మ నేతృత్వంలో గుండి వినయ్‌శర్మ మంత్రోచ్చారణల మధ్యన స్వామివారి కళ్యాణం, హారతి, మంత్రపుష్పం, ఊయలసేవ కార్యక్రమాలు కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం లలితా పారాయణం గ్రూప్ సభ్యులచే పారాయణం నిర్వహించగా భక్తులు అదిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాలకు విచ్చేసిన భక్తులకు బోయినిపల్లి లక్ష్మణ్‌రావు కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మేరుగు శ్రీనివాస్, కమిటీ సభ్యులు జడల వెంక టేశం, గంధ్ర వెంకట్ రావు, కిషన్‌రావు, భాస్కర్‌రావు, పార్థసారథి, కొమురయ్య, సుదాకర్, రమేష్ పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ మండలంలోని అల్లీపూర్ వేంకటేశ్వర స్వామి



కోరుట్లలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఆలయంలో ఆదివారం గోదా రంగనాయకుల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. భాజాభ జంత్రీలు, వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాలె శోభారాణి, మాజీ ఎంపీటీసీ బాలె చంద్రశేఖర్, ఎంపీటీసీ మోర విజయలక్ష్మి, వెంకటేష్, బాలె రాజేష్, మనీషా పాల్గొన్నారు.

మల్లాపూర్, జనవరి, 14 : మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో ఆదివారం గోదా రంగనాధుల కల్యాణం ఘనంగా పురోహితులు జరిపారు. ఈ సందర్భంగా ఆలయంలోని స్వామి వారికి అభిషేకాలు, అలంకారణ, హారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి కల్యాణంను పురోహితుల వేదమంత్రతోవాలతో వైభవంగా జరిపారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



మెట్‌పల్లిలో కల్యాణంలో పాల్గొన్న విద్యాసాగర్‌రావు దంపతులు



మల్లాపూర్‌లో నృత్యం చేస్తున్న పండితులు



పెగడపల్లిలో కల్యాణ వేడుక

దశల వారీగా అభివృద్ధి పనులు పూర్తి

● వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్, జనవరి 14 : ప్రజలు తనకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని కష్ట, సుఖాల్లో పాలుపంచుకుని అభివృద్ధి పనులను దశల వారీగా పూర్తి చేస్తానని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గంభీర్‌పూర్, బొమ్మెన గ్రామాల్లో కృతజ్ఞతా ర్యాలీల్లో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో గెలిచిన అనంతరం మొదటి సారిగా రావడంతో డీజే చప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. మేడిపల్లి, బీమారం, కథలాపూర్ మండలాల వరప్రదాయినిగా ఉన్న సూరమ్మ చెరువు, వర్షాలకు తెగిపోయిన గంభీర్‌పూర్ కొచ్చెరువు, తాండ్ర్యాల - గంభీర్‌పూర్ గ్రామాల మధ్య ఉన్న వంతెన నిర్మాణ పనులకు దశల వారీగా పూర్తి చేసుకునే ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం మొదట ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ చికిత్స రు. 10 లక్షలకు పెంపు వంటి పథకాలు అమలు చేసిందన్నారు. రాబోవు వంద రోజుల్లో మిగిలిన గ్యారంటీలు పూర్తి చేసేందుకు కసరత్తు కొనసాగుతోందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తన గెలుపునకు కృషి చేసిన ప్రతీ ఒక్కరికీ రుణం పడి ఉంటానని కలిసికట్టుగా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, రాష్ట్ర చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి పులి హరిప్రసాద్,



గంభీర్‌పూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

రాష్ట్ర ఫిషరీస్ విభాగం కార్యదర్శి కల్లెడ గంగాధర్, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు అల్లూరి దేవన్న, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు యాగండ్ల రమేశ్ గౌడ్, చెదలు సత్యనారాయణ, అయూబ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జవ్వాజి చౌదరి, ఉరుమల్ల చారి, కట్ట శంకర్, సత్యనారాయణ, రాష్ట్ర ఎన్‌ఆర్‌ఐ సెల్ అధ్యక్షుడు నరేష్‌రెడ్డి, స్వామిరెడ్డి, తిరుపతిరెడ్డి ఉన్నారు.

సైన్స్‌తోనే సమాజ అభివృద్ధి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, జనవరి 14: సైన్స్ ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ వాల్ పోస్టర్‌ను ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో నెలకొన్న మూఢ విశ్వాసాలను నిర్మూలించాలంటే సైన్సును విస్తృతంగా ప్రచారం చేయాన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న చెకుముకి టాలెంట్ టెస్ట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు సి రామరాజు, జిల్లా అధ్యక్షుడు గుర్రం అంజనేయులు, ప్రధాన కార్యదర్శి సంపతి రమేష్, ఉపాధ్యక్షుడు ప్యారం లక్ష్మీ నారాయణ, కార్యదర్శి మెడపట్ల కిషన్ పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

ధర్మపురి, జనవరి 14: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కాశెట్టివాడ యూత్ ఆధ్వర్యంలో చిరకాల మిత్రులు స్మారక క్రికెట్ కప్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఈ నెల 7న ప్రారంభించిన ఈ క్రికెట్ పోటీల్లో 24 జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌లో ధర్మపురి 11 జట్టు, దమ్మన్నపేట జట్టు ఫైనల్ మ్యాచ్‌కు చేరుకున్నాయి. ఈ మ్యాచ్‌లో దమ్మన్నపేట జట్టు విజేతగా నిలిచింది. విజేతకు పట్టణ మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్ రూ 20,000 నగదు, నిర్వాహకులు ట్రోఫీని అందించారు. రన్నర్‌గా నిలిచిన జట్టుకు సాక నిశాంత్ (యుఎస్ఏ) రూ 15,000 నగదు, నిర్వాహకులు ట్రోఫీని అందించారు. నిర్వాహకులు సోమిశెట్టి రంజిత్, మాదాసు నిఖిల్, గడిపెల్లి భీంరాజ్, చందు, చల్ల రణధీర్, హృతిక్, క్రీడాకారులు పాల్గొన్నారు.



నగదు ట్రోఫీ అందుకుంటున్న దమ్మన్నపేట జట్టు

'ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి'

కరీంనగర్ టౌన్, జనవరి 14: ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టీయూటీ జిల్లాశాఖ ప్రభుత్వాన్ని కోరింది. ఈమేరకు ఆదివారం రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోనె శ్రీనివాస్, అట్ల శ్రీనివాస్ రెడ్డి కలిసి ఉపాధ్యాయుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ముఖ్యంగా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని, బదిలీ అయి రిలీవ్ కానీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, 317 జీవో, స్పౌజ్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర, జిల్లా బాధ్యులు కేతిరి తిరుపతిరెడ్డి, జయేందర్‌రెడ్డి, చొల్లేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు



కాంగ్రెస్‌లో చేరిన వారితో ఆది శ్రీనివాస్

కథలాపూర్, జనవరి 14: మండలంలోని తక్కళ్లపల్లికి చెందిన 50 మంది యువకులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో ఆదివారం చేరారు. మండల కాంగ్రెస్ బీసీ విభాగం అధ్యక్షుడు అల్లకొండ లింగంగౌడ్ నేతృత్వంలో వెళ్ళగా క్యాంపు కార్యాలయంకు వెళ్లగా కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, గ్రామ శాఖ అధ్యక్షుడు దమ్మ తిరుపతి, గుగ్గిళ్ళ తుక్కయ్య, పోచంపల్లి ప్రేమ్ ఉన్నారు.

మెట్‌పల్లి: కోమటికొండాపూర్ గ్రామ ఎంపీటీసీ కోరుట్ల నియోజకవర్గం ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో ఆదివారం చేరారు. పార్టీలో చేరిన ఎంపీటీసీ జిల్లేష్‌కు కండువా కప్పి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధికి ప్రతీఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ లీగల్ అడ్వైజర్‌గా రమేశ్

కోరుట్ల, జనవరి 14: కోరుట్ల కాంగ్రెస్ పార్టీ లీగల్ అడ్వైజర్‌గా కస్తూరి రమేశ్‌ను నియమించారు. ఈ మేరకు ఆదివారం నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, ఉపాధ్యక్షుడు నయిం, కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం, ఆడెపు మధు, సంగు లింగం, మ్యాకల నర్సయ్య, రిజ్వాన్ తదితరులు ఉన్నారు.

రాజన్న భక్తుల సేవలో తరించాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్



పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడ, జనవరి 14 : రాజన్న దర్శనం కోసం వచ్చే భక్తుల సేవలో గౌడ సంఘం సభ్యులు తరించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వేములవాడ పట్టణంలోని మొదటి బైపాస్ రహదారిలోని మహాలక్ష్మి వీధిలో నిర్మిస్తున్న గౌడ నిత్యాన్నదాన సత్రం భవన నిర్మాణ పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడ సంఘం నిత్యాన్న సత్రం భవన నిర్మాణం కోసం ఇప్పటికే అనేక మంది దాతల నుంచి విరాళాల సేకరించామన్నారు. వీలైనంత తొందరగా పనులను పూర్తి చేసి స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులకు వసతి కల్పించాలని, అందుబాటులోకి తీసుకు రావాలని సూచించారు. భవన నిర్మాణానికి కావాల్సిన సహాయ సహకారాలు అందించడానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి బాధ్యతలు స్వీకరించి మొదటిసారిగా వచ్చిన సందర్భంగా పొన్నం ప్రభాకర్‌ను గౌడ సంఘం నాయకులు సన్మానించారు. గౌడ సంఘం నాయకులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, పులి రాంబాబు గౌడ్, నేరెళ్ల తిరుమల్ గౌడ్, పిల్లి కనకయ్య, సిలివేరి శ్రీనివాస్, వస్తాద్ కృష్ణ, ఎల్లయ్య గౌడ్, నాగుల రవి, కదిరి రాజు, గజ్జల పర్శరాములు, కత్తి కనకయ్య తదితరులు ఉన్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుడిపై కేసు

వీణవంక, జనవరి 14: వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో బెల్టుషాప్ నిర్వహిస్తున్న పంజాల కుమార్‌పై కేసు నమెదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. పక్కా సమాచారం మేరకు షాప్‌లో తనిఖీ చేయగా 5,300 రూపాయల విలువ గల మద్యం సీసాలు లభ్యమయి నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరయినా బెల్టుషాప్‌లు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసు కుంటామని ఎస్సై హెచ్చరించారు.

ఘనంగా భోగి వేడుకలు

ధర్మపురి, జనవరి 14: ధర్మపురి మండలంలో బోగీ పండుగ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని అనేక గ్రామాల్లో పలువురు తమ కుటుంబ సభ్యులతో కలిసి భోగి మంటలు ఏర్పాటు చేశారు. ఈ భోగి పండుగ భోగ భాగ్యాలను, సుఖ సంతోషాలను తేవాలని కోరుతూ వేడుకలు నిర్వహించారు. పలువురు పరస్పరం పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇదిలా ఉండగా అనేక మంది భక్తులు స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శనం చేసుకున్నారు.

కథలాపూర్: మండలంలోని సిరికొండలో ఆదివారం తెల్లవారు జామున బోగి పండగ వేడుకలు ఘనంగా జరిగాయి. పిల్లలు, పెద్దలు బోగి మంటలు వేసి చుట్టూ తిరుగుతూ ఆటా, పాటలతో నృత్యాలు చేశారు. నిప్పు రవ్వల కనికలు, ఎగిసి పడే మంటల భగభగలు, చీకట్లను చీల్చే కాంతులు చైతన్య రావాలు, గజ గజ వణికించే చలి పారిపోయేలా చేశారు. పాత ఆలోచనలు బోగి మంటల్లో వేసి కొత్త ఆలోచనలకు నాంది పలకడమే పండగ ఉద్దేశ్యమని పేర్కొన్నారు. పాత కష్టాలు, బాధలను అహూతి చేస్తూ ఈ ఏడాది శుభం కలగాలని కోరుకున్నారు.

గొల్లపల్లి: గొల్లపల్లి మండల కేంద్రంతో పాటు మల్లన్నపేటతో పాటు పలు గ్రామాల్లో బోగీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మల్లన్నపేట గ్రామంలో రైజింగ్ స్టార్స్ యూత్ ఆధ్వర్యంలో ఉదయాన్నే బోగీ మంటలు అంటించారు. బీ ఆర్ఎస్‌వీ మండల అధ్యక్షుడు ఆవారి చందు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బోగీ పండుగ అందరి ఇంట్లో భోగభాగ్యాలు తెచ్చి, ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో సంక్రాంతి జరుపుకుని సుభిక్షండా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు గుండేటి గణేష్, అవారి శ్రీనివాస్, నస్పూరి గణేష్, గుండేటి శ్యామ్, లక్కాకుల రవి, బీమా సతీష్, కట్ట రమణ, శ్రావణ్, మధు, రంజిత్, వంశీ, రమేష్, మనోజ్, రాకేష్ పాల్గొన్నారు.

కొడిమ్యాల: కొడిమ్యాల మండల కేంద్రంలో గల స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో వాకర్స్ యూనియర్ ఆధ్వర్యంలో ఆదివారం బోగీ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ యూనియన్ అధ్యక్షుడు రాపర్తి లక్ష్మణ్ మాట్లాడుతూ బోగీ సందర్భంగా గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కనీసం ప్రతి ఒక్కరూ రోజుకు 30 నిమిషాలు వాకింగ్ చేసి ఆరోగ్యకరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బోగీ మంటను ఏర్పాటు చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపర్తి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నాంపల్లి మల్లేశం, వేముల రవీందర్, కొంజర్ల రవీందర్, జోగినిపల్లి వెంకటేశ్వర్ రావు, మోహన చారి, తూడి రాజేశం, సత్యనారాయణ, ఐకేపీ రాజు, యెల్లం పరమేశ్వర్, రాపర్తి సత్యం, లక్ష్మణాచారి, బోయిని మల్లేశం, మధుకర్, నజీర్, ముమ్మాడి రాజమౌళి, సుష్మశ్రీ పాల్గొన్నారు.

బీర్‌పూర్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని ఆయా గ్రా మాలలో ఆదివారం భోగి వేడుకలు నిర్వహించారు. ఇంటి వాకిళ్లలో వేసిన రంగు రంగుల ముగ్గులు పలువురిని ఆకట్టుకున్నాయి. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బంధువులు చిన్నారులతో గ్రామాల్లో సందడి నెలకొంది. పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు ఏర్పాటు చేసి సంస్కృతి సంప్రదాయలకు అర్థం పట్టేలా ముగ్గు వేసి గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ మసర్తి రమేష్, జెడ్పీటీసీ పాత పద్మ రమేష్, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మన్ రావ్, మహిళ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.



ధర్మపురిలో భోగి మంటలు



రాయికల్‌లో భోగి వేడుకల్లో పాల్గొన్న వాకర్స్ యూనియన్ సభ్యులు



మల్లన్నపేటలో భోగి వేడుకల్లో పాల్గొన్న యువకులు